# జగనన్న సురక్ష.. సూపర్ సక్సెస్

- ఏలూరు జిల్లా మున్సిపాలిటీల్లో జంగారెడ్డిగూడెం ప్రథమ స్థానం
- ఏలూరు జిల్లాలో రూరల్ మండలాల్లో జంగారెడ్డిగూడెం తృతీయ స్థానం
- జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో 10వ సచివాలయం ప్రథమ స్థానం



జంగారెడ్డిగూడెంలో సురక్ష కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా (ఫైల్)

**జంగారెడ్డిగూడెం :** అర్హులై ఉండి సంక్షేమ లబ్ధి పొందకుండా ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే ముఖ్య ఉద్దేశ్యంతో జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్టాత్మక కార్యక్రమమే జగనన్న సురక్ష. సరైన ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా సాంకేతిక కారణాల వల్ల అక్కడక్కడా పథకాలు పొందకుండా మిగిలిపోయిన వారిని జల్లెడ పట్టి వారి వివరాలు సేకరించి అవసరమైన పథకాలు, సేవలు నేరుగా అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న సురక్ష సూపర్ సక్సెస్ అయ్యింది. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ప్రజలు ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి చూపారు. అలాగే వారికి కావాల్సిన పథకాలు, ఎదుర్కొంటున్న సమస్యలను కార్యక్రమం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలతో పాటు, వివిధ రకాల పథకాలకు సంబంధించి అనుమతులు సైతం లబ్ధిదారులు అందుకున్నారు. జగనన్న సురక్ష క్యాంపులు ఒక ఉద్యమంలా జరిగాయి. దీంతో ఈ కార్యక్రమం సూపర్ హిట్ అయ్యింది. ప్రజల ముంగిటే ప్రభుత్వ సేవలు అందడంతో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా వివిధ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సమయం కావడం, ఆయా పథకాలకు ధ్రువీకరణ పత్రాలు అవసరం కావడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పత్రాలు అవసరమైన వారు వివిధ సర్టిఫికెట్లను అందుకున్నారు. ప్రభుత్వ సేవలు, ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై ప్రజల్లో పూర్తి హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.

**విజయవంతంగా ముగిసిన సురక్ష**

ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ, మండల పరిధిలో సురక్ష కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. మున్సిపాలిటీ పరిధిలో 10,100, మండల పరిధిలో 17,335 మొత్తం 27,435 వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు జగనన్న సురక్షకార్యక్రమాల ద్వారా అందజేశారు. కాగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ వెల్లడించారు. అలాగే మున్సిపాలిటీలు, రూరల్ మండలాలతో పోల్చితే జిల్లాలో జంగారెడ్డిగూడెం 3వ స్థానం సాధించినట్లు చెప్పారు. అలాగే జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పరిధిలో 10వ సచివాలయంలో అత్యధికంగా 2,565 ధ్రువీకర పత్రాలు పంపిణీచేసి మొదటి స్థానంలో నిలిచింది.

### పంపిణీ చేసిన పత్రాలు

| | జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో (సంఖ్య) | జంగారెడ్డిగూడెం మండలంలో (సంఖ్య) |
|---|---|---|
| కుల ధ్రువీకరణ | 5,247 | 8,187 |
| ఆదాయ ధ్రువీకరణ | 4,654 | 7,281 |
| అడంగల్ పత్రాలు | 38 | 479 |
| 1బి పత్రాలు | 31 | 600 |
| ఆధార్ అప్‌డేట్ | 29 | 558 |
| ఆరోగ్యశ్రీ కార్డులు | 20 | 13 |
| రేషన్ కార్డులు | 36 | 69 |
| వివాహ ధ్రువీకరణ పత్రం | 8 | 3 |
| ఆస్తి ధ్రువీకరణ పత్రం | 4 | – |
| ఓబీసీ సర్టిఫికెట్లు | 4 | – |
| లేబర్ లైసెన్సు పత్రాలు | 3 | – |
| ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ | 2 | 8 |
| కౌలు కార్డులు | 1 | 123 |
| మరణ ధ్రువీకరణ పత్రం | 1 | – |
| ఆస్తి పన్ను విధింపు పత్రం | 22 | – |
| ఇంటి స్థలం కోసం | – | 6 |
| పొజిషన్ సర్టిఫికెట్ | – | 6 |
| వ్యవసాయ ఆదాయ పత్రం | – | 1 |
| మ్యూటేషన్ | – | 1 |
| మొత్తం | 10,100 | 17,335 |

### రెండు రోజుల్లో ఇచ్చారు



పేదవాడికి ఎంతో ఉపయోగపడే ఆరోగ్యశ్రీ కార్డు నా కుటుంబానికి లేదు. ఇదే విషయాన్ని వలంటీర్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులకు తెలియజేసి దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో ఆరోగ్య శ్రీ కార్డు మంజూరైంది. మా వార్డు పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు ఆరోగ్య శ్రీ కార్డును అధికారులు, ప్రజా ప్రతినిధులు అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు.

– పద్మనాభుని ఈశ్వరి, జంగారెడ్డిగూడెం

### ఒక్క రూపాయి ఖర్చు కాలేదు



వివిధ రకాల ప్రభుత్వ పథకాలకు, కుటుంబ అవసరాలకు నాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. వలంటీర్ ఇంటికి వచ్చినప్పుడు విషయాన్ని తెలియజేశాం. దీంతో మాచేత దరఖాస్తు చేయించి ఒక్కరూపాయి ఖర్చు లేకుండా మాకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా అందజేశారు.

– యడ్లపల్లి భూలక్ష్మి, జంగారెడ్డిగూడెం

## మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు





పారిజాతగిరిలో అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

తమలపాకులతో పూజలు అందుకున్న మద్ది ఆంజనేయస్వామి

**జంగారెడ్డిగూడెం రూరల్ :** గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారికి శనివారం పంచామృతాలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామానికి చెందిన భక్తులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ. 1,25,550 వచ్చినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

**పారిజాతగిరిలో విశేష పూజలు**

**జంగారెడ్డిగూడెం :** గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవతో మొదలుకుని స్వామివారికి నిత్య ఆరాధన, నివేదన, ఆలయానికి విచ్చేసిన భక్తులకు సర్వదర్శనం హారతి, అష్టోత్తర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు నల్లూరు రవికుమారాచార్యులు నిర్వహించారు. సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు బయ్యన్నగూడెంకు చెందిన నాటకశాల వెంకటరాజు, శ్రీనివాసపురానికి చెందిన చెల్లా లోకేశ్వరరావు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

## పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి

**జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి**



శివకాశీపురం పునరావాస కేంద్రంలో వరద బాధితుల భోజనాన్ని పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

**వేలేరుపాడు :** వరద పునరావాస కేంద్రంలోని ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అధికారులను ఆదేశించారు. వేలేరుపాడు మండలం శివకాశీపురంలోని వరద పునరావాస కేంద్రాన్ని శనివారం అధికారులతో కలిసి పరిశీలించి, అక్కడ ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, సేవలను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి మాట్లాడుతూ వరద పునరావాస కేంద్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, పునరావాస కేంద్రం పరిసరాలలో పూర్తి పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు వ్యాపించకుండా మలాథియాన్ వంటివి స్ప్రే చేయించాలని, వంట చేసే ప్రదేశంలో కూడా పరిశుభ్రంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రంలో బియ్యం, నూనె, కూరగాయలు వంటి సరుకులు పూర్తిస్థాయిలో నిల్వ ఉండేలా చూడాలన్నారు. వైద్య శిబిరంలో మందులు 30 రోజులకు నిల్వ ఉండేలా చూడాలని, ముఖ్యంగా పాము కాటు నివారణ మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరంలో సిబ్బంది 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జేసీ వెంట జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఝాన్సీరాణి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి



బాలికలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు

**చింతలపూడి :** పోక్సో చట్టంపై బాలికలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు అన్నారు. ప్రపంచ వ్యక్తుల అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణాకు పేదరికమే కారణమన్నారు. పేదరికాన్ని ఆసరా చేసుకుని కొందరు పిల్లలను, మహిళలను కిడ్నాప్ చేసి విక్రయించి వారిని వివిధ పనులకు వినియోగిస్తున్నారని తెలిపారు. సొంత బంధువులు సైతం పిల్లలపై అత్యాచారాలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయని, పిల్లలు ఎవ్వరినీ నమ్మ వద్దని ముఖ్యంగా యుక్త వయస్సుకు వచ్చిన యువతులు ప్రేమ పేరుతో మోసపోవద్దని హెచ్చరించారు. కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరాలని సూచించారు. వసతి గృహంలో పిల్లలకు అందిస్తున్న ఆహార, వసతి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో న్యాయవాదులు డేవిడ్‌రాజు, వెంకట చైతన్య, ఉమర్ ఫరూఖ్, ఏసుపాదం, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ, ఎస్సై కె.ప్రసాద్, వార్డెన్లు ప్రభావతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్.. నిరుపేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పంపిణీ చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**బుట్టాయగూడెం :** నిరుపేదల ఆరోగ్యానికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెం గ్రామానికి చెందిన గానుగుల నాగేశ్వరరావుకి వెన్నుకు సంబంధించి అత్యవసరంగా హైదరాబాద్‌లో కిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చికిత్స కోసం మంజూరైన రూ. 3 లక్షల రూపాయల ఎల్‌ఓసీ చెక్కును నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరో నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నిధులు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే బాలరాజుకు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞలు తెలిపారు.

## ఆటో, బైక్ ఢీ.. నలుగురికి గాయాలు



కొమ్మర శివారులోని ప్రమాద ఘటనా స్థలంలో రోడ్డుపై రోదిస్తున్న క్షతగాత్రులు

**ద్వారకాతిరుమల:** మండలంలోని కొమ్మర శివారులో శనివారం ఉదయం ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. క్షేత్రంలో నిమ్మకాయల వ్యాపారం చేసుకునేందుకు కొమ్మర గ్రామానికి చెందిన గోకవరపు కుమారి, మానుకొండ గంగ నిమ్మకాయల బస్తాను పాసింజర్ ఆటోలో వేసుకుని, ద్వారకాతిరుమలకు వెళుతున్నారు. అదే సమయంలో రాళ్లకుంటలో ఒక రైతు వద్ద కమతం ఉంటున్న రామకృష్ణ కొమ్మర గ్రామానికి బైక్‌పై వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఆటో, బైక్ ఎదురెదురుగా వేగంగా ఢీకొనడంతో, ఆటో మార్జిన్‌లోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీగల నాగేశ్వరరావు తలకు తీవ్ర గాయం కాగా, కుమారికి కాలు విరిగింది. అలాగే గంగకు నడుమ భాగంలో బలమైన గాయాలు కాగా, రామకృష్ణకు కాలు, చేయి విరిగింది. స్థానికులు హుటాహుటీన క్షతగాత్రులను తొలుత ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## గ్యాస్ లీకై.. అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేసిన అనంతరం దుకాణాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**ద్వారకాతిరుమల:** క్షేత్రంలోని గుడిసెంటర్‌లో శ్రీవారి విలాస మండపం ఎదురుగా ఉన్న కూల్ డ్రింక్, టీ షాపులో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని తిరుమలంపాలెంకు చెందిన నాయుడు రాజా గత కొన్నాళ్లుగా స్థానిక దుకాణంలో కూల్ డ్రింక్స్, టీ విక్రయాలు సాగిస్తున్నాడు. రోజులానే అతడు తెల్లవారుజామున షాపును తెరచి, టీ కాస్తుండగా, గ్యాస్ లీకై ఒక్కసారిగా సిలీండర్ నుంచి పెద్ద పెద్ద శబ్దాలతో మంటలు వ్యాపించాయి. దాంతో ఆ ప్రాంతంలోని స్వామివారి కల్యాణ మండపంలో నిద్రిస్తున్న భక్తులు తీవ్ర భయాందోళనతో అక్కడి నుంచి పరుగులు తీశారు. మంటలను అదుపు చేసేందుకు రాజా ఎంతగానో ప్రయత్నించాడు. అయితే సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 30 వేలు నష్టం జరిగినట్టు తేల్చారు.

## నిబంధనలకు విరుద్ధంగా.. వాహనాల పార్కింగ్



బయ్యన్నగూడెం మెయిన్ సెంటర్లో నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనాల పార్కింగ్

**కొయ్యలగూడెం:** బయ్యనగూడెం మీదుగా వెళ్లిన నేషనల్ హైవేపై ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడం ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. గ్రామ మధ్యలో డివైడర్‌తో సహా నిర్మించబడిన నేషనల్ హైవేకి ఇరువైపులా ద్విచక్ర వాహనదారులు షాపుల ముందు నిర్లక్ష్యంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే ఇతర వాహనదారులకు పార్కింగ్ చేసి ఉన్న వాహనాల వలన ఇబ్బందులు కలుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఎదురుగా వెళుతున్న వాహనాలను ఓవర్ టేక్ చేస్తున్న వెనుక వాహనాలు ఒక్కొసారి షాపుల మీదకు దూసుకువస్తున్నాయని, అదే సమయంలో నడిచి వెళుతున్న వారి మీదకు సైతం వస్తున్నాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా వాహనాల పార్కింగ్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నిర్వాసితులకు ఈ గతి పట్టించింది చంద్రబాబే

**కుక్కునూరు :** నిర్వాసితులు ఈ రోజు ఇంత దయనీయ పరిస్థితిని ఎదుర్కొడానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు పేర్కొన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ శనివారం కుక్కునూరులో నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించడాన్ని నరసింహరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ 2018 నాటికల్లా ఆర్‌అండ్‌ఆర్ పరిహారాన్ని ఇస్తామని చెప్పి నిర్వాసితులను వంచించింది మీ నాయకుడు కాదా అని ప్రశ్నించారు. ఆ రోజు నీవు ఎమ్మెల్యేగా ఉండి నిర్వాసితులకు ఏమి చేశావని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పాపాల కారణంగానే పోలవరం ప్రాజెక్ట్‌కు నిధుల విడుదలపై కేంద్రం కొర్రీలు పెట్టడానికి కారణమైందన్నారు. ఆనాడు కేంద్రంతో జతకట్టిన మీ నాయకుడు ప్రాజెక్ట్ ప్రచారంపై చూపిన శ్రద్ధ నిర్మాణంపై చూపి ఉంటే ఈనాడు నిర్వాసితులకు ఈ దుస్థితి ఉండేది కాదన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా గోదావరి వరద వస్తే నిర్వాసితులకు మీ నాయకుడు ఒక్క రూపాయైనా పరిహారం ఇచ్చాడా అని ప్రశ్నించారు. మొడియం మాట్లాడే విధానం గురవింద సామెతను గుర్తుచేస్తుందన్నారు. ప్రతి పేదవాడి గుండె చప్పుడు తెలిసిన వ్యక్తి కనుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోదావరి వరదకు దెబ్బతిన్న ఇళ్లకు రూ10 వేల నుంచి రూ.95 వేల పరిహారాన్ని అందించాడన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతోనే టీడీపీ నాయకులకు నిర్వాసితులపై ప్రేమ పుట్టుకొస్తుందని వాఖ్యానించారు. టీడీపీ నాయకుల కల్లిబొల్లి మాటలు నమ్మే స్థితిలో నిర్వాసితులు లేరన్నారు.

## క్లుప్తంగా

### శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

**ద్వారకాతిరుమల:** చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు వైపు ఉన్న వైకుంఠం క్యూకాంప్లెక్స్‌తో పాటు, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, అనివేటి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతంతో పాటు అన్నదానం, ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

### శ్రీవారి సేవలో భీమవరం డెప్యూటీ కలెక్టర్



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా డెప్యూటీ కలెక్టర్ అఖిల

**ద్వారకాతిరుమల:** శ్రీవారి ఆలయాన్ని పశ్చిమగోదావరి జిల్లా (భీమవరం) డెప్యుటీ కలెక్టర్ దేవరకొండ అఖిల శనివారం సాయంత్రం సందర్శించారు. ముందుగా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆమె శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని పలికి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

### శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం వేమగిరికి చెందిన సూరపురెడ్డి జానకిరామయ్య ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

### దుప్పట్ల పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం :** మండలంలోని మారుమూల గ్రామమైన లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని గిరిజన విద్యార్థినులకు జంగారెడ్డిగూడెంకు చెందిన అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, దిండ్లు, కంచాలు, గ్లాసులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ సభ్యులు కురెళ్ల రాంబాబు, గరిమెళ్ల గంగాధర శాస్త్రి మాట్లాడుతూ 150 మంది విద్యార్థినులకు సుమారు రూ.50 వేల విలువైన దుప్పట్లు, తలగడలు, కంచాలు, గ్లాసులను పంపిణీ చేసినట్లు చెప్పారు. అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగప్రసన్నాదేవి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు కుంచాడ ప్రసాద్, ఆయుర్వేదం రాము, విశ్వనాథ్, లక్కవరం బాబు, దాతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### గుబ్బల మంగమ్మ గుడి రహదారికి మరమ్మతులు



గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రహదారి మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

**బుట్టాయగూడెం :** భారీ వర్షాలు, వాగుల ప్రవాహాల వల్ల ఇసుక మేట్లు, రాళ్లు ఏర్పడి గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే రహదారి దెబ్బతింది. ఈ రహదారి మరమ్మతు పనులను శనివారం ఆలయ కమిటీ వారు చేపట్టారు. కాలువలో పేరుకుపోయిన ఇసుక, రాళ్లను జేసీపీతో తీయించి ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు వెళ్లే విధంగా సరిచేశారు. ఆదివారం గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి భక్తులను అనుమతిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

## అప్ ల్యాండ్ పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం



అధ్యక్షుడిగా ఆనందం సుబ్బారావు

**కొయ్యలగూడెం :** అప్ ల్యాండ్ పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొయ్యలగూడేనికి చెందిన ఆనందం సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లాలోని 11 మండలాలకు సంబంధించి 93 మంది ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ సభ్యులు సుబ్బారావును ఎన్నుకున్నారు. సుబ్బారావు సారథ్యంలో ఇప్పటివరకు అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది అని దీంతో మరోమారు సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో కొయ్యలగూడెంలో నిర్మిస్తున్న పీఎంపీ అసోసియేషన్ భవన నిర్మాణం పూర్తిచేసేందుకు కృషి చేస్తానని సుబ్బారావు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శిగా రాయపూడి మురళీకృష్ణ, ట్రెజరర్‌గా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సింహాచలం, జాయింట్ సెక్రటరీగా బసవచార్యులు ఎన్నికయ్యారు.

## అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం :** తన భర్త అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఒక వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ భీమశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన బేతంపూడి ప్రశాంతికి ఏలూరుకు చెందిన బేతంపూడి సుభాష్‌చంద్రబోస్‌తో వివాహమైంది. కొంతకాలం వీరి సంసారం సాఫీగా సాగింది. అయితే ఇటీవల అదనపు కట్నం కోసం భర్త సుభాష్‌చంద్రబోస్ శారీరకంగా, మానసికంగా వేధించడమే కాకుండా అతని కుటుంబ సభ్యులు కూడా ఇందుకు సహకరిస్తున్నారు. ఈ విషయమై గతంలో పెద్దల్లో కూడా పెట్టారని, వారి మాట కూడా పట్టించుకోలేదని, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

## లారీని ఢీకొని సూపర్‌వైజర్ దుర్మరణం



చంద్రశేఖరరావు మృతదేహం

**కొయ్యలగూడెం:** బైక్‌పై వెళుతూ ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన చంద్రశేఖరరావు (47) గ్రీన్‌ఫీల్డ్ హైవేలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. 28వ తేదీ రాత్రి విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై జగన్నాథపురం వెళుతున్నాడు. కొయ్యలగూడెం సమీపంలో కొవ్వూరు రోడ్డులో ఓ లారీ పెట్రోల్ బంక్‌లోకి వెళుతుండగా చంద్రశేఖరరావు బైక్‌తో లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా, వెంటనే అతనిని చికిత్స నిమిత్తం స్థానికులు జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ శనివారం చెప్పారు.

## వ్యక్తికి గాయాలు

**జంగారెడ్డిగూడెం :** ఇరువురికి మధ్య జరిగిన ఘర్షణలో మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం వేగవరం గ్రామానికి చెందిన తూంపాటి చినరాజు ఒక వృద్ధుడితో గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో గొడవలు పడవద్దని సర్దిచెప్పడానికి వెళ్లిన పెద్దపూడి శ్రీనివాస్‌ను తూంపాటి చినరాజు కత్తి తీసుకుని గాయపర్చాడు. బాధితుడు శ్రీనివాస్ స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

## ఘనంగా మొహర్రం



కుక్కునూరులో పీర్ల ఊరేగింపు

**కుక్కునూరు:** మొహర్రం పండుగను శనివారం కుల, మతాలకు అతీతంగా వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అగ్నిగుండం ఏర్పాటు చేసి మొక్కులు తీర్చుకున్న భక్తులు మధ్యాహ్నం నుంచి డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.